త్రైలోక్యగీత
త్రయోదశాధ్యాయము
భగవద్వర్ణ విచార యోగము

త్రైలోక్యా ఉవాచ:-
కా మే ప్రేమ కథం? కృష్ణః, క్షత్రీయో యాదవో౽థవా |
బ్రూహి దత్త! బుద్ధి తేజాః, వేణుగోపాలకృష్ణ! మామ్ ||13.1||

[కుమారి త్రైలోక్య ప్రశ్న:- ఓ దత్త దేవ! అత్యంత మేధాశక్తి గల వేణుగోపాలకృష్ణుడిగా తమరు అవతరించినారు! స్వామీ! కామము నందు ప్రేమ యొక్క స్థానమెక్కడ? దయచేసి తెలుపండి, మరియు శ్రీ కృష్ణుడు క్షత్రియుడా? లేక యాదవుడా? దయచేసి నాకు వివరించగలరు.]

శ్రీశ్రీశ్రీ దత్తస్వామీ ఉవాచ:-
తేజా నామ్నా చ విఖ్యాతే!, త్రైలోక్యే! బుద్ధి తేజసా |
ప్రేమ కామౌ భావ కర్మ-రూపా వన్యోన్య సంశ్రయౌ ||13.2||

[**శ్రీశ్రీశ్రీ దత్తస్వామి వచించారు:-** ఓ త్రైలోక్య! నీవు గాఢమైన మేధాశక్తి కారణంగా తేజ అనే మరొక పేరుతో గుర్తింపు గలదానవు. ప్రేమ అనునది భావరూపము, కామము అనునది క్రియాత్మకము. ఈ రెండు పరస్పరము అస్తిత్వమును పంచుకుంటాయి.]

ధర్మాధర్మ ముఖౌ ప్రేమ-కామౌ ప్రకృతి కేవలౌ |
తత్తత్ఫలా వుభౌ ధర్మ్యౌ, వధర్మ్యౌ వా న మిశ్రమౌ ||13.3||

[ప్రేమ లేదా భావరూప ప్రేమ అంటే మనసుకు ఇష్టమైనది లేదా కోరిక. ఇది ధర్మబద్ధమైనది కావచ్చును లేదా అధర్మబద్ధమైనది కూడా కావచ్చును. కామము లేదా ఆచరణాత్మక రతిక్రీడ అనేది ప్రేమ(కారణంగా)కు పర్యవసానంగా సంభవించెడి ప్రత్యక్ష

కామక్రియ. ఒకవేళ ప్రేమ యొక్క దిశ న్యాయము వైపు ఉంటే దాని పరిణామ క్రియ అయిన కామము కూడా ధర్మబద్ధమైనదై, స్వర్గలోకమును ఇచ్చెడి పుణ్యకర్మ అగును. ఒకవేళ ప్రేమ యొక్క దిశ అన్యాయము వైపు ఉంటే దాని పరిణామ క్రియ అయిన కామము కూడా అధర్మబద్ధమైనదై, అట్టి పాపకర్మ నరకమునకు చేర్చును. ఈ విధంగా రెండూ కలిసి ఉండి, రెండు స్థాయిలలో పాపము లేదా పుణ్యము అను స్వభావాలను ప్రదర్శిస్తుంది. పైన తెలిపిన మొదటి వర్గములో ధర్మబద్ధమైన ప్రేమ, ధర్మబద్ధమైన కామమును కలుగజేస్తుంది. రెండవ వర్గములో అధర్మబద్ధమైన ప్రేమ, అధర్మబద్ధమైన కామమును కలుగజేస్తుంది. దీని వలన మనము తెలుకోవలసినది ఏమిటంటే క్రింద చెప్పిన రెండు వర్గాల పరిస్థితులు ఏర్పడే అవకాశము లేనే లేదు. 1. ధర్మబద్ధమైన ప్రేమ అధర్మబద్ధమైన కామమును కలిగించుట 2. అధర్మబద్ధమైన ప్రేమ ధర్మబద్ధమైన కామమును కలిగించుట. అంటే ఏ తరహాలో అయినా సజాతీయత మాత్రమే సాధ్యము, విజాతీయత సాధ్యము కాదు.]

ఉభయోర్భావ రూపాంతః, కామః కర్మణి చ స్మృతః |
యథేష్టం భిద్యతే రూఢిః, కృష్ణ గోప్యో ర్న మిశ్రమః ||13.4||

[సాధారణంగా జనులు ప్రేమను అభినందిస్తారు, 'కామము' అనే పదము వింటే మాత్రము చిన్నచూపులు చూస్తారు. కామము అను పదమునకు శాబ్దిక అర్థము కోరిక. కాబట్టి కామము కూడా ప్రేమకు ప్రత్యామ్నాయ శబ్దము కాగలదు. కాని కామము అనే శబ్దము ఆచరణాత్మక రతికేళి అనే కర్మకు కూడా పర్యాయపదము. చతుర్విధ పురుషార్థములలో కామము అన్నప్పుడు అది ఆచరణాత్మక రతికేళి అవుతుంది. భగవద్గీతలో కూడా కామము అనే శబ్దము ఆచరణాత్మక రతికేళినే సూచిస్తుంది. (**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి**..). ఒక విశేష పదము, వినియోగించు వారి స్వతంత్రమును బట్టి పదము యొక్క

అర్థము ఒక్కొక్క సందర్భములో ఒక్కొక్క విధముగా మారుతుంది. శ్రీకృష్ణ భగవానుడు మరియు గోపికల మధ్య గల సంబంధములో మిశ్రమ తరహా (ధర్మప్రేమ భావము-అధర్మకామ కర్మలు) ఉన్నట్లు భావిస్తారు. ఎందుకంటే భగవంతుని యందు భావరూప ప్రేమ ఉండటము ధర్మబద్ధమైనది అంటారు, కాని భగవంతుని యందు ఆచరణాత్మక కామము ఉండటము మాత్రము అధర్మబద్ధమైనది అంటారు. అయితే మిశ్రమ వర్గము లేనే లేనందున వారి భావన అసమంజసము.]

న మిశ్రమోఽపి సర్వత్ర, ప్రియభావో నిషిధ్యతే |
భర్తా ధర్మ్యః ప్రియో ధర్మ్యః, వైధర్భ్యే వా న రాధికా || 13.5||

[మరికొందరు ఇలాంటి మిశ్రమవర్గములు భగవంతుని యందు చూపరాదు అనుకుంటారు. వారి దృష్టిలో సజాతీయ తరహాలో భగవంతుని యందు ధర్మబద్ధమైన ప్రేమ కారణముగా ధర్మబద్ధమైన క్రియలు అంటే భగవంతునికి చేయు ఆచరణాత్మక సేవలు (శుశ్రూష మొదలగునవి) అంగీకరించదగినవి, కాని భావరూప ప్రేమ కారణముగా కలిగిన ఆచరణాత్మక కామము, కామక్రియగా కొనసాగడము అనే సజాతీయ తరహాను భగవంతుని యందు సమర్పించరాదు అనుకుంటారు. దీని అర్థము ఏమిటంటే, జీవాత్మ భగవంతుని తండ్రిగాను, సోదరుని గాను, గురువు గాను, భర్త గాను ప్రేమించవచ్చును కాని అనైతిక ప్రియుడిగా కాదు, ఎందుకంటే ఇలాంటి అనైతిక బంధము అధర్మబద్ధమై, పాపభరితమై నరకలోకములోకి నెట్టుతుంది. అదే బంధము అంటే భగవంతుడిని ప్రియుడుగా భావించి ప్రేమించే(భక్తి) విధానము, ఒకవేళ వివాహమునకు ముందే అయితే అది సమంజసము. ఉదాహరణకు సీత మరియు రుక్మిణి విషయంలో జరిగింది. కాని రాధ విషయంలో ఇది వర్తించదు, ఎందుకంటే రాధకు అయనఘోషునితో వివాహమైనది, అయినా ఆమె శ్రీకృష్ణుని ప్రేమించినది, ఆ కారణం చేత కృష్ణునితో

ఆచరణాత్మక కామకేళిలో పాల్గొన్నది, అయితే శ్రీకృష్ణునితో గోపికల ప్రేమ, కామము సజాతీయ వర్గంలో (అధర్మబద్ధమైన ప్రేమ కారణంగా ఏర్పడిన అధర్మబద్ధమైన కామము) అయినప్పటికీ వారు పరమ రహస్యముగా మాత్రమే ఆచరణాత్మక కామమును నిర్వహించారు.]

ప్రవృత్తౌ సర్వ మాదేయం, నివృత్తి ర్దైవ జీవయోః |
దైవ దైవే జీవ దేవే, దండనీయం న దైవతమ్ ||13.6||

[కీలకమైన అంశము ఏమిటంటే, ఇక్కడ మనము ధర్మబద్ధమైన వాదనలను ప్రాపంచిక అంశముల పరిధిలో ఏమాత్రం వ్యతిరేకించడము లేదు. ఒకవేళ రాధ, కృష్ణుడు మనుషులే అయి ఉంటే మనము పైన చెప్పినది మొత్తము సత్యమే అయి ఉండేది. కాని ఇక్కడ రాధ శివ భగవంతుని అవతారము. మిగతా గోపికలు మానవ జీవాత్మలైన పరమ పవిత్ర ఋషులు. నిస్సంశయముగా శ్రీకృష్ణుడు విష్ణు భగవంతుని అవతారము. శ్రీకృష్ణునికి రాధతో, లేదా గోపికలతో గల సంబంధము నివృత్తి లేదా ఆధ్యాత్మిక బంధము. లోతుగా వివరించాలంటే *భగవంతునికి- భగవంతునితో* గల *సంబంధము* లేదా *భగవంతునికి జీవాత్మలతో* గల *సంబంధము* కాబట్టి ఇది ప్రవృత్తి అనగా జీవాత్మలకు జీవాత్మలతో గల సంబంధము గురించిన విషయం కానీ ఏ మాత్రం కాదు. ఒకవేళ నీవు ప్రవృత్తిలోనున్న ధర్మములను నివృత్తిలో కూడా ప్రయోగించాలనుకుంటే అప్పుడు నీవు నివృత్తిని తొలగించాలి, కేవలం ప్రవృత్తిని మాత్రమే అన్ని నియమ-నిబంధనలు పాటిస్తూ అన్నిచోట్ల అనుసరించాలి. పైన వివరించినట్లు వ్యతిరేకత గల జనులకు మా ముఖ్యమైన ప్రశ్న ఒక్కటే - నీవు ఒక నియమం రూపొందించావు, ప్రతిఒక్కరూ దానిని అనుసరించాలి. ఇక్కడ గల ఉదాహరణలో ఆ నియమము ఉల్లంఘించడం జరిగినది. అలా నియమోల్లంఘన చేసిన జీవాత్మలను నీవు శిక్షించదలిస్తే అది కూడా మనకు అంగీకారమే.

కాని ఒకవేళ అట్టి నియమోల్లంఘన భగవంతుని చేత జరిగితే నీవు భగవంతుని కూడా శిక్షిస్తావా? నిశితమైన విశ్లేషణలో ఈ సందర్భమునందు ఏ పాపమూ లేదని స్పష్టముగా గోచరించుచున్నది.]

ధర్మో మార్గః స గమ్యో హి, ధర్మో దత్తాశ్రయో హి గౌః |
అస్మాకం రక్షకో ధర్మః, స కృష్ణో ధర్మ రక్షకః || 13.7||

[ధర్మమును అనుసరిస్తే భగవంతుడు ఎంతో సంతోషిస్తాడని శాస్త్రములు మరియు జ్ఞానులు ఎలుగెత్తి చాటుతున్నారు. ధర్మము మార్గమైతే, చేరుకోగల పరమ లక్ష్యము భగవంతుడు. మరి నీవు లక్ష్యమును మార్గముతో బంధించగలవా? న్యాయదేవత స్వయంగా దత్తదేవుని (శ్రీ కృష్ణుడు దత్తావతారము) ఆశ్రయం కోరి ఆతని వెనక ఆవు రూపములో నిలిచింది. దీనిని బట్టి, దత్తుడు (భగవంతుడు) రక్షకుడు, ఆవు (ధర్మము) రక్షింపబడేది. కాని నీవు నిర్ణయించిన సూత్రము ప్రకారము, ధర్మదేవత రక్షకురాలు మరియు దత్తుడు రక్షింపబడుతున్నట్లు కనబడుతుంది. లోకంలో ధర్మమును నీవు రక్షిస్తే అది నిన్ను రక్షిస్తుంది (ధర్మో రక్షతి రక్షితః) అని ఒక నానుడి ఉన్నది. ఇది సరైనదే, కాని ఇది కేవలం జీవాత్మల మధ్య మాత్రమే వర్తిస్తుంది. భగవంతుడు రక్షకుడు మరియు ధర్మాన్ని పాలించే దేవుడు (**ధర్మస్య ప్రభురచ్యుతః**...) అని శాస్త్రములు ఘోషిస్తున్నాయి. ధర్మ సంస్థాపన కొరకు, ధర్మ రక్షణ కొరకు తాను అవతరిస్తానని దత్తావతారుడైన కృష్ణుడు లేదా విష్ణువు అవతారమైన కృష్ణుడు చెప్పినాడు. (**ధర్మ సంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే ….భగవద్గీత**).]

ప్రోక్త స్సమన్వయో గూఢః, బోధ్యస్సర్వైః సుబుద్ధిభిః |
ప్రవృత్తి ధర్మ సూత్రేణ, శుకేన చ నృణాం హితే ||13. 8||

[గత అధ్యాయములలో సంపూర్ణ మోక్షము గురించి వివరించేటప్పుడు, భగవంతునితో చాలా లోతుగా ఏర్పడిన బంధము కారణంగా ప్రాపంచిక బంధాలు అనబడే మూడు ఏషణల నుండి సంపూర్ణ మోక్షమును మేము వివరించిన విషయమును, ఆస్తికులెవరైనా కొంత ఏకాగ్రత కనబరిస్తే అర్థము చేసుకోగలరు. బలహీనమైన వారెవ్వరూ సర్వశక్తిమంతుడైన భగవంతుని అవతారములను అనుకరించరాదని, ఒకవేళ అలా అనుకరిస్తే అట్టి ఆత్మ నశిస్తుందని (**అవర దౌర్బల్యాత్.. ధర్మసూత్రము**) ప్రవృత్తిని బోధించే శాస్త్రములలో కూడా బోధించబడినది. పరీక్షిత్ మహారాజుకు శుకమహర్షి ఈ ఒక్క అంశమును మాత్రమే చెప్పి, ఈ విషయ విశ్లేషణను పొడిగించలేదు. ఎందుకంటే, కేవలము భగవంతునికి మాత్రమే వర్తించగల ఈ విధానమును సాధారణ జనులకు చేర్చి దురుపయోగము చేసినట్లయితే ఆ జీవాత్మలు నశించిపోతాయని శుక మహర్షి ఆ విధంగా స్థూలంగా చెప్పి ఉన్నారు.]

ధర్మ్యో వాలి వధోప్యఽస్య దండభోగః పురాకృతః |
భవద్భ్యోఽపి జగత్పాలః, ప్రాగ్వేత్తి లోక సంగ్రహమ్ ||13.9||

[భగవంతుడు ఈ జగత్తుకు పరిపాలకుడు, కావున మీ అందరి కంటే ఎంతో ఎక్కువగా ఈ సృష్టి సంక్షేమము కొరకు కావలసిన పరిష్కారములు అన్నీ బాగుగా తెలిసినవాడు. గతములో ఈ విషయమును ఒక ఉదాహరణ ద్వారా, చెట్టు చాటున ఉండి వాలిని వధించిన భగవంతుడు నిరూపించాడు. చూడటానికి అధర్మముగా కనిపించినా గాని లోతైన విశ్లేషణ చేసినపుడు ఇది ధర్మమే అని ద్యోతకమవుతుంది. వాలి ఒక పాపి, పైగా ఆయనకు వరము ఏమిటంటే వాలి ఎదురుగా నిలబడి యుద్ధం చేసే వారి బలములో సగము తగ్గి, ఆ సగభాగము వాలి బలముతో చేరుతుంది. కావున యుద్ధము ఎవరితో జరిగినను అంతిమ విజయము మాత్రము వాలి పొందుతాడు. అటువంటప్పుడు వాలిని ఇలా

మోసపూరిత పద్ధతిలో వధించడము తప్ప వేరే మార్గమే లేదు. అయితే దీనిని అనుకరించి మరెవరూ ఇలాంటి దుస్సాహసం చేయరాదని తలచి, రాముడు దీనిని పాపకర్మగానే పరిగణించాడు. అంటే జీవాత్మ లెవరైనా మరొకరిని పాపిగా నిర్ధారించి, వెనుక నుండి చంపకూడదు. ఇలాంటి దురుపయోగమును అరికట్టడానికి ధర్మబద్ధమైన కర్మ అయిన వాలి సంహారమును కూడా పాపకర్మగా బలపరచి భగవంతుడు కృష్ణావతారములో శిక్షకు లోనయ్యాడు. శ్రీకృష్ణుని చంపుటకు వేటగాడు అతని పాదమునకు పదునైన బాణమును సంధించి కృష్ణ నిర్యాణమునకు కారణమైనాడు. స్వయంగా భగవంతుడే శిక్ష స్వీకరించి, ధర్మపరిరక్షణ చేసి సృష్టి అంతటా జనులు నరావతారులను అనుకరిస్తూ, దైవపరిధిలోని విశేష భావనలను దురుపయోగము చేయకుండా రక్షిస్తాడు.]

దైవత్వాత్ సర్వమోక్షాచ్చ, న పాపమపి పాపవత్|
దండం భుంక్తే తత శ్శాంతః, రక్షితో లోక సంగ్రహః || 13.10||

[గోపికలు, శ్రీకృష్ణుల మధ్య జరిగిన ప్రేమ-కామ సంబంధము పాపకర్మ కాదు, ఎందుకంటే, 1. శ్రీకృష్ణుడు పరమోత్కృష్టమైన శక్తి గల భగవంతుడు కావున ప్రాపంచిక ధర్మములు తనకు అంటనేరవు. 2. ఋషులు బలహీనమైన వైవాహిక బంధముతో సహా అన్ని ప్రాపంచిక బంధముల నుండి విముక్తిని కోరుకున్నారు. కృష్ణుడు దీనిని పాపకర్మగా భావించి వారి స్థానములో తాను నరకములో శిక్షకు లోనయ్యాడు. ఎందుకంటే కృష్ణుని వలన అపరాధము జరిగినదనే వాదన సరైనది అని భావించే నీవు, సంతృప్తి చెందడానికి మాత్రమే. ఇప్పుడిక శ్రీకృష్ణుని నిందించుటకు నీకు ఇసుమంత కూడా అవకాశము లేదు. ఈ ప్రపంచము అంతటా ప్రవృత్తి నశిస్తుందని నీవు కృష్ణుని నిందిస్తావు కాబట్టే శ్రీకృష్ణుడు కూడా ఇది పాపకర్మగా స్వీకరించి శిక్షను అనుభవించాడు. ఈ ప్రపంచము అంతా కృష్ణుని చేత

రక్షింపబడింది, ఎలాగంటే, పాపకర్మగా పరిగణించబడిన కర్మకు శిక్షను అనుభవించడము ద్వారా తానే ఈ ప్రపంచమునకు ఇది పాపకర్మ అని, కావున శిక్షార్హము అని, ఎవ్వరూ తనను అనుకరించి ఇట్టి కర్మలు పునరావృతము చేయరాదనే బోధనను ప్రత్యక్షంగా దృశ్యమానము చేశాడు. ఇంతటితో ఈ విషయము ముగుస్తుంది కావున దీనికి పూర్తి విరామము అవసరము.]

కర్తుం పాప మపాపం నా, విపరీతం తతో విభుః |
స్వార్థాయ జగతే చైవం, భేదో జీవేశయోరయమ్ ||13.11||

[భగవంతునికి, జీవునికి మధ్య బేధము ఇక్కడ స్పష్టముగా ఇవ్వబడినది. జీవాత్మ స్వార్థ ప్రయోజనముతో, ఇతరులకు హాని చేస్తూ కూడా, ఆయా పాపకర్మలను ధర్మబద్ధమైనవిగా నిరూపించడానికి ప్రయత్నిస్తాడు. దీనికి పూర్తి విలోమముగా, అజ్ఞానులు తనను గుడ్డిగా అనుకరిస్తూ, భగవత్కార్యములను దురుపయోగము చేస్తూ, జీవాత్మలు స్వార్థపూరిత సుఖాలతో నశించిపోతాయేమోనని, భగవంతుడు తన నిష్పాపకర్మలను కూడా పాపకర్మలుగా పరిగణిస్తాడు.]

రాజ్యం భ్రష్టం యదోశ్శాపాత్, అక్షత్రియా హి యాదవాః |
యదు యాచనయా దత్తః, తద్వంశే కృష్ణ సంభవః || 13.12||

[కృష్ణుని వంశములోని పూర్వీకుని పేరు యదువు. తన పేరు మీదుగా ఆ వంశం యాదవ వంశము అనబడినది కావున ఈ పేరుకు కులముతో ఎలాంటి సంబంధము లేదు. ఎలాగైతే రఘుమహారాజు వంశములోని వారిని రాఘవులు అంటారో, ఈ పేరు కూడా అలాంటిదే. క్షత్రియధర్మము అయిన రాజ్యపాలన అధికారము నుండి బహిష్కరిస్తూ యదువుకు, తండ్రి ఇచ్చిన శాపము కారణంగా యదువంశంలో పుట్టిన తరాలకు రాజ్యపాలన అధికారము దూరమైనది. యదువు దత్తభగవానుని కొరకు అడవిలో

ఘోరతపస్సు చేసి తన వంశమును ఉద్ధరించమని కోరాడు. కాబట్టి దత్త భగవానుడు యాదవవంశములో అవతరించాడు.]

కృష్ణో రాజ్యకరో భూయః, క్షత్రియోఽభూత్ తతః కులమ్ |
గుణ కర్మానుగం గీతం, తేనైవం స్వానుభూతిమాన్ ||13.13||

[యదువుకు శాపవిమోచనము చేసి శ్రీకృష్ణుడు రాజ్యస్థాపన చేశాడు. ఇలా రాజ్యస్థాపన చేసిన కృష్ణుడు తిరిగి క్షత్రియుడైనాడు. దీనిని బట్టి చూస్తే యదువు పూర్వీకులు క్షత్రియులు కావున వారు రాజ్యపాలన చేసెడివారు. యదువు మొదలుకొని కృష్ణుని వరకు గల యాదవులు క్షత్రియులు కాదు, ఎందుకంటే వారికి రాజ్యము లేదు. ఎప్పుడైతే తిరిగి కృష్ణుడు రాజ్యమును పరిపాలించడము ఆరంభించాడో, అప్పటి నుండి యదువంశము తిరిగి క్షత్రియ వంశము అయింది. దీనిని బట్టి కులము యొక్క స్వభావము (రాజ్యపాలనాధికారము)- ఆరోపిత కర్మలను బట్టి ఉంటుంది. వ్యక్తిగత అనుభవమును అనుసరించి శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతలో, కర్మలు-వాని స్వభావములను అనుసరించియే కులము నిర్ణయింపబడింది. భగవంతుడు ఎల్లప్పుడు కర్మ-స్వభావముల ప్రాతిపదికనే వర్ణవ్యవస్థను ఏర్పాటు చేసినాడు. (**చాతుర్వర్ణం మయా సృష్టం, గుణకర్మ విభాగశః ..**)]

పురోపి స్థాపితసోఽర్థః, జన్మనా క్షత్రియో యదుః |
తత్ పుత్రాః క్షత్రియా ఏవ, యాదవాః కథమన్వయాత్? || 13.14||

[గుణ-కర్మలను అనుసరించి కులమును నిర్ణయించ గల ఈ భావన కృష్ణుడు రాజ్యస్థాపన చేసి క్షత్రియుడుగా మారకముందే నిరూపించబడినది. ఈ సంఘటనకు పూర్వమే యదువు క్షత్రియుడుగా జన్మించినప్పటికీ తన కులమును కోల్పోయి ఉన్నాడు, కాబట్టే తన సంతానము యాదవులయ్యారు, క్షత్రియులు

కాదు. ఎప్పుడైతే క్షత్రియులు యాదవులైనారో, అప్పుడే కులము అనేది గుణ-కర్మల ఆధారముగా ఏర్పడిన భావన అని ప్రత్యక్ష నిరూపణ చేయబడినది. ఒకవేళ నీవు జన్మను బట్టి కులము నిర్ణయింపబడినది అంటే యదువు క్షత్రియుడు, ఎందుకంటే అతని తండ్రి క్షత్రియ వంశస్థుడు. యదువు క్షత్రియుడు కాబట్టి, యదుసంతానము కూడా క్షత్రియులే కావలసినది కదా! ఎప్పుడైతే యదువు సంతానము క్షత్రియులు కాలేదో, అప్పుడే వర్ణవ్యవస్థ జన్మ ఆధారంగా ఏర్పడినది కాదని, కేవలము గుణ కర్మలను అనుసరించియే ఏర్పడినది అని తెలుస్తున్నది.]

యాదవానాం నవో వర్ణః, రాజ్యపాలన విచ్యుతేః |
నవో గోపాలనాద్వర్ణః, రాఘవానాం పురః కులమ్ || 13.15||

[యాదవులు (రాజైన యదువుకు సంతానముగా తర్వాతి తరములలో పుట్టినవారు.) రాజ్యపాలన నిర్వహిస్తున్న క్షత్రియ మూలము గలవారు. అదే యాదవులు రాజ్యపాలన అధికారమును యదువు యొక్క తరము అనంతరము కోల్పోయినారు. వారిప్పుడు యాదవులు అనే సరికొత్త కులము వారయ్యారు, ఎందుకంటే వారు ఆవులను పాలించడము అనే కొత్త ఉపాధి కర్మను స్వీకరించారు. అంటే కులమునకు ఆధారము, వారి వృత్తి(కర్మ) మరియు అందుకు ఆధారభూతమైన వారి భావ రూపమైన నిపుణతలు(గుణములు). వారు ఎంచుకున్న వృత్తి కారణముగానే క్షత్రియులనే గుర్తింపు సమాప్తమవడమే కాక యాదవులు అయ్యారు. కావున కులము జన్మ ఆధారమైనది కాదు, వృత్తిని, దానికి ఆధారమైన భావనలను బట్టి ఉంటుంది. యాదవుల మాదిరిగానే, రాఘవులు (రఘుమహారాజు యొక్క వంశజులు) కూడా క్షత్రియులే, రాజ్యపాలనాధికారము గల వారే, కాని తమ అధికారమును కోల్పోలేదు, కాబట్టి వారు అదే క్షత్రియవంశములో కొనసాగారు. వృత్తి ఆధారముగా మరియు సంబంధిత నిపుణతల ఆధారముగానే కులవ్యవస్థ ఉంటుందన్న సూత్రమును

(గుణకర్మ), జన్మ ఆధారముగా కాదని చాలా స్పష్టంగా నిరూపిస్తున్నది.]

గుణాను కర్మ గుణతో, వర్ణో భిన్నో ఽరుణ శ్శశీ |
కాలేఽస్మిన్ న పురా విప్రో, నిత్యం బ్రహ్మర్షిరేవ హి||13.16||

[కులము అనేది గుణము, కర్మల ఆధారితమైనదని ప్రత్యేకముగా తెలుపనవసరము లేదు. ఎందుకంటే, గుణములే జీవాత్మలను వివిధ కర్మలు చేయుటకు ప్రేరేపిస్తాయి. కావున గుణముల ఆధారమైన కులమును మాత్రమే తెలియజేయాలి. దీని అర్థము ఏమిటంటే, గుణస్వభావములను బట్టి నీవు ఒకని కులమును నిర్ణయించవచ్చును, కర్మలను ఎంచనవసరం లేదు. కావున గుణముల ఆధారభూతమైన కులమునే ఆత్మ ధరిస్తుంది. కావున క్షణక్షణము కులము మారిపోతూ ఉంటుంది, ఎందుకంటే గుణములు ప్రతినిమిషము మారుతూ ఉంటాయి. ఇది నిజమే అయినప్పటికీ, సందర్భమును బట్టి గుణముల నిష్పత్తి మారడము వర్తమాన కలియుగములోనే జరుగుచున్నది. ప్రాచీన కాలములో సందర్భమును బట్టి గుణముల నిష్పత్తి మారడము జరుగలేదు కాబట్టి కులవ్యవస్థ శాశ్వతముగా ఉన్నది. ఉదాహరణకు ప్రాచీన కాలములో *కులరీత్యా బ్రాహ్మణుడు, సమాజమునకు ఆధ్యాత్మిక జ్ఞానమును ఎల్లపుడూ బోధించినందుకు దివ్యమైన బోధకుడైన బ్రహ్మర్షిగా ఉండిపోయాడు.* అయితే, ఇప్పటి కాలములో కూడ, క్షణికపు మార్పులు నిత్యమైన జీవ స్వభావమును మార్చలేవు. ఏలననగా, అట్టి మార్పు. బాహ్య సందర్భమును బట్టి వచ్చిన తాత్కాలిక ప్రభావమే కానీ, నిత్య జీవ స్వభావములోని మార్పు కాదు. ఈ కారణముగా పరిస్థితులను బట్టి జీవ స్వభావములో వచ్చిన క్షణికపు మార్పుల ఆధారముగా, నిత్య జీవ స్వభావమైన కులము మారుచున్నట్లు కాదు. ఉదాహరణకు, చంద్రుడు తెల్లనివాడు. ఇది చంద్రుని నిత్య స్వభావము. అయితే, సాయంకాలము నందు సంధ్యాకాంతి ప్రభావము వలన కొంచెము సేపు చంద్రుడు ఎర్రగా

కనిపించును. ఇందువలన, చంద్రునిలో ఎరుపు రంగు ఎప్పుడునూ సంక్రమించలేదు.]

సత్త్వం విప్రః పరేఽప్యన్యః, పరౌ వైశ్య శ్చతుర్థతః |
శూద్రో గుణానుగో వర్ణో, న హి వర్ణానుగో గుణః ||13.17||

[గుణ స్వభావములను కులము పేరు అనుసరిస్తుంది, కులము పేరును అనుసరించి గుణములు ఏర్పడవు. శుద్ధ సత్త్వము (99% సత్త్వము, 1% రజస్సు మరియు తమస్సు) బ్రాహ్మణుడు అనబడుతుంది. సత్త్వముతో పాటు రజస్సు కూడా ప్రబలంగా ఉంటే అది క్షత్రియుడు అనబడుతుంది. ఒకవేళ రజస్సు మరియు తమస్సు ప్రబలముగా ఉంటే అది వైశ్యుడు అనబడుతుంది. ఒకవేళ శుద్ధ తమస్సు ఉంటే (99% తమస్సు, 1% రజస్సు మరియు సత్త్వము) అది శూద్రుడు అనబడుతుంది. వివరించిన విధముగా గుణ స్వభావములను అనుసరించి మనిషికి కులము పేరు గుర్తింపబడుతుంది. ఒకే కులములో పుట్టిన ప్రతివ్యక్తికి అదే నిష్పత్తిలో స్వభావములు ఉండకపోవచ్చును. అనగా, గుణములను బట్టి కులమును నిర్ణయించవలెను కాని కులమును బట్టి గుణమలను నిర్ణయించరాదు.]

సంతతిః స్థిరనిష్పత్త్యోః, స్థిరా చేతద్వర్ణ సంకరః |
ప్రభావాత్ సా స్థిరా పిత్రోః, గుణా రక్తాన్న విజ్ఞతః || 13.18||

[నిర్ణీతమైన స్థిర గుణస్వభావముల నిష్పత్తి, నిర్ణీత కులముగా నిర్ధారింపబడినది. కావున గుణస్వభావముల నిష్పత్తి నిజముగా మారినపుడు, మారిన గుణముల స్వాభావిక నిష్పత్తి ఆధారముగా కులము కూడా మారుతుంది. ఒకవేళ రెండు వేర్వేరు స్థిర నిష్పత్తులలో గుణములు గల ఇద్దరు విహమాడితే అది కులాంతర వివాహము అవుతుంది. వారికి జన్మించిన శిశువు తల్లిదండ్రుల ప్రభావమును కలిగి ఉంటుంది. వారిద్దరిలో ప్రబలముగా ఉన్న

గుణస్వభావములను అనుసరించి సరాసరి స్థిరనిష్పత్తిని పొంది ఆ శిశువు మిశ్రమ కులము (వర్ణ సంకరము) వాడవుతాడు. ఏది ఏమైనా, తల్లిదండ్రుల రక్తము కారణముగా పిల్లలకు గుణస్వభావముల నిష్పత్తి వస్తుందని మాత్రము భావించరాదు. ఎందుకంటే ఈ నిష్పత్తి వారి రక్తముతో సంబంధము లేకుండా, కేవలము వారి గుణస్వభావముల ఆధారముగానే ప్రాప్తిస్తుంది. ఒక జీవుడి గుణనిష్పత్తి ఆ జీవుడి అనేక జన్మల సంస్కారములను పట్టి చాలా బలంగా ఏర్పడుతుంది. తల్లిదండ్రుల వద్ద పెరుగుచున్నపుడు వారి ప్రభావమును అనుసరించి సంక్రమించిన గుణములు, అనేక జన్మ సంస్కారగుణముల ముందు నిలువలేవు. ఇట్టి అనేక జన్మ సంస్కారమునే ప్రకృతియని గీతలో చెప్పబడినది (ప్రకృతిం యాంతి.., ప్రకృతేర్గుణ సంమూఢాః.., ప్రకృతి స్త్వాం నియోక్ష్యతి..). జన్యుశాస్త్రమును అనుసరించి, జన్యువులు, తల్లిదండ్రులకు సంబంధించిన కొన్ని శారీరక స్వభావములను మాత్రమే సంతానముకు సంక్రమింపజేస్తాయి, కాని గుణములను కాదు.]

అవిజ్ఞానా దసృగ్వర్ణః, సహవాస ప్రభావ సత్ |
అధ్యాస భ్రమ సిద్ధాంతో, రక్తే వాస గుణోపరి || 13.19||

[జన్యుశాస్త్ర పరిజ్ఞానము లేనందున మన పూర్వీకులు తల్లిదండ్రులతో గల రక్తసంబంధము కారణముగా బిడ్డలకు గుణస్వభావములు వస్తున్నాయని భావించేవారు. ఈ అపోహ మనలను ఎలా ఆలోచింపజేసిందంటే, తల్లిదండ్రుల నుండి బిడ్డలకు గుణస్వభావములు వస్తున్నాయని, కాబట్టి బిడ్డ జన్మించినప్పుడే తన గుణస్వభావములను ఊహించదగినదని భావించడము వలన జన్మ ఆధారిత కులమును నిర్ణయించారు. ఇది చాలా అజ్ఞానము. యథార్థము ఏమిటంటే, బిడ్డ, తల్లిదండ్రుల స్వభావము చేత ప్రభావితమౌతాడు. వారితో అతి దగ్గరగా నిరంతరము గడపడము చేత వారి గుణస్వభావములను అందిపుచ్చుకుంటాడు. ఇలా

తల్లిదండ్రులతో పోల్చదగిన గుణస్వభావములను పెరిగిన సంతానములో చూసి తల్లిదండ్రుల రక్తసంబంధముతో పాటు గుణస్వభావములు సంక్రమించాయి అనుకోవడంతో, జన్మ నుండే కులమును నిర్ణయంచాలనే అపోహకు దారితీసింది. నిరంతరము తల్లిదండ్రుల సహవాసముతో గ్రహింపబడిన గుణ స్వభావములతో ఉన్న సంతానమును చూసి పొరపాటుగా అది జన్మ ఆధారిత కులవ్యవస్థగా పరిణమించినది. ఎందుకంటే, గుణస్వభావముల ఆధారమైన కులవ్యవస్థ అనే భావన కంటే చాలా ఎక్కువగా రక్తసంబంధము ఆధారముగా కులవ్యవస్థ అనెడి తప్పుడు భావన యొక్క ప్రాబల్యము అధికముగా ఉన్నది.]

గుణ కర్మానుగో వర్ణః, ప్రాగ్భావాద్వా ప్రభావతః |
నాన్యో మార్గోఽస్తి జన్యాదిః, కలౌ జన్మ కులం న సత్ ||13.20||

[కాబట్టి జీవాత్మలో నున్న గుణస్వభావములకు అనుగుణముగా చేయబడు కర్మలే, వారి కులమును నిర్ణయిస్తాయి. అంతే తప్ప ఏ విశేషమైన దంపతులు తల్లిదండ్రులుగా జన్మించిన జీవాత్మ అని కాదు. గుణస్వభావములు జీవాత్మతో చేరువిధములు 1. పూర్వ జన్మల సంస్కారముల నుండి వచ్చినవి 2. ఇతర జీవాత్మలతో కలిసి ఉండటము చేత వర్తమాన జన్మలో ప్రభావితము కావటము చేత సమకూరినవి. ఈ రెండు మార్గాలను కాక రక్తసంబంధము లాంటి వేరే ఏ ఇతర మార్గాల నుండి గుణస్వభావములు జీవాత్మను చేరలేవు. పాప భూయిష్ఠమైనటువంటి కలియుగములో అసత్యసిద్ధాంతమైన జన్మ ఆధారిత కులవ్యవస్థ అధికముగా వృద్ధి చెందినది. ఈ కులవ్యవస్థ ఏ మాత్రమూ సత్యమైనది కాదు.]

|| ఇతి త్రైలోక్యగీతాయాం 'భగవత్ వర్ణవిచార యోగో' నామ త్రయోదశాధ్యాయః ||

ఈ విధముగా త్రైలోక్యగీత యందు పదమూడవ అధ్యాయమైన భగవద్వర్ణ విచారయోగము పరిసమాప్తము.